


# హైదరాబాద్ వార్త

# జిహెచ్ఎంసి మేయర్, డిప్యూటీ మేయర్లకు పదవీగండం ..!

**-అవిశ్వాసం పెట్టేందుకు బిఆర్ఎస్ ప్లాన్**
**-గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలతో తలసాని నివాసంలో సమావేశం**
**-హాజరైన వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్...ఇతర ప్రజాప్రతినిధులు**
**-జిహెచ్ఎంసి బడ్జెట్ మీటింగ్...అవిశ్వాసం వంటి అంశాలపై చర్చ**

**హైదరాబాద్, జనవరి 21,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి మేయర్‌గా ఎంపికైన గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయరైన శ్రీలతా శోభన్ రెడ్డిని పదవులకు పదవిగండం పట్టుకుంది. ఈనెల 10తో పాలకమండలికి నాలుగేళ్ళ పూర్తికానున్న నేపథ్యంలో వారిపై అవిశ్వాసం పెట్టేందుకు బిఆర్ఎస్ పావులు కదుపుతుంది. ఈనేపథ్యంలోనే బిఆర్ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇంట్లో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించగా దీనికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సైతం హాజరయ్యారు. ఈనేపథ్యంలో మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసంతోపాటు నగరలో ఇందిరమ్మ, ఇళ్లు, రేషన్ కార్డులు జారీ, వంటి అంశాలపై చర్చించారు.

**బిఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి జంప్..**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచి అప్పటి ప్రభుత్వ ఆశీస్సులతోనే మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కించుకున్నారు. ఆసమయంలో ఎంఐఎం సైతం బిఆర్ఎస్‌కు అండగా నిలబడింది. ఆతర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీరిద్దరూ బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో తమ పార్టీ వల్ల పదవులు పొంది పార్టీ మారినా రాజీనామా చేయకుండా ఇంకా పదవుల్లో కొనసాగుతుండటాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే కాంగ్రెస్ కార్పొరేటర్లు సైతం కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న తమకు దక్కని యోగం.. వారికి దక్కడంపై అంతర్గతంగా కలతచెందుతున్నారు. వీరు పార్టీలో చేరాక తమ ప్రాధాన్యం తగ్గిపోయిందనే తలంపులో ఉన్నారు. కాంగ్రెస్ తొలుత రెండు సీట్లు మాత్రమే గెలిచినప్పటికీ, లింగోజిగూడ బీజేపీ కార్పొరేటర్ ఆకుల రమేష్ గౌడ్ మృతితో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచి ముగ్గురయ్యారు. తర్వాత పరిణామాలతో బీజేపీ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి 18 మంది చేరడంతో ఆ పార్టీ బలం 24కు పెరిగింది. ఎంఐఎం 44 స్థానాల్లో గెలవగా ఒకరు మరణించారు. ఇద్దరు రాజీనామాలు చేయడంతో ప్రస్తుతం 41 మంది ఉన్నారు. బీజేపీ 48 స్థానాల్లో గెలవగా ఆదిలోనే ఒకరు మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో ఓటమితో 47 మంది అయ్యారు. అనంతరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్ మృతి చెందడం, కొందరు పార్టీలు మారడంతో ప్రస్తుత బలం 39గా ఉంది. బిఆర్ఎస్ వారు 56 సీట్లలో గెలిచారు. బీజేపీ నుంచి నలుగురు పార్టీలో చేరడంతో బలం 60కి పెరిగినప్పటికీ.. అనంతరం 18 మంది కాంగ్రెస్ లోకి వెళ్లడంతో ప్రస్తుతం 42 మంది ఉన్నారు.

**అవిశ్వాసం పెట్టాలంటే..**

జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నికలు 2020 డిసెంబర్ జరగగా మేయర్, డిప్యూటీ మేయర్లు 2021 ఫిబ్రవరి 11వ తేదీన బాధ్యతలు చేపట్టారు. జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. అయితే ఫిబ్రవరి 10తో ఈనాలుగేళ్ల కాలం పూర్తికానుంది. దీంతో వారిపై అవిశ్వాసం పెట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల్లో (స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సగం మంది నిర్ణీత ప్రొఫార్మాలో తీర్మానం చేసి సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. ఆతర్వాత 15 రోజుల్లో సంతకాలు పెట్టిన ప్రజాప్రతినిధులు..మిగతా సభ్యులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. అందులో 98మంది సభ్యులు అశ్వాసానికి అనుకూలంగా ఉంటే అవిశ్వాసం నెగ్గినట్లు..అందులో ఒక్కరు తక్కువైనా అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తారు. అయితే జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు, 50 మంది ఎక్స్ అఫిసియో సభ్యులు మొత్తం 196 మంది ఉన్నారు. వీరిలో సగం అంటే 98 మంది సభ్యుల సంతకాలు అవసరం. అయితే బీఆర్ఎస్‌కు ప్రస్తుతం 42 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు కలిపి 71 మంది సభ్యుల బలం ఉంది. అవిశ్వాసం పెట్టాలంటే మరో 27 మంది సభ్యులు అవసరం. దీంతో ఎంఐఎం లేదా బీజేపీతో కలిస్తేనే అవిశ్వాసం పెట్టేందుకు వీలవుతుంది. అయితే గతంలో బిఆర్ఎస్‌కు మద్దతిచ్చిన ఎంఐఎం ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో అవిశ్వాసం పెడితే బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహం ఉంటుంది. వాళ్లు పెట్టే అవిశ్వాసానికి బిజెపి మద్దతుఇస్తుందా..లేదా తటస్థంగా ఉంటుందా అన్న చర్చ జోరుగా సాగుతుంది.

## చర్లపల్లి టెర్మినల్ నుంచి దక్షిణ మధ్య రైల్వే మరిన్ని రైళ్లు


చర్లపల్లి స్టేషన్

**తార్నాక జనవరి 21, ప్రభాతవార్త :** చర్లపల్లి టెర్మినల్ నుంచి చెన్నై, గోరఖపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడానికి దక్షిణ మధ్యరైల్వే ఏర్పాటు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే మార్చిలో మరో ఎనిమిది రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పై ఒత్తిడి తగ్గిస్తూ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. రైలు ప్రయాణాలకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సమయం 60 రోజులు ఉండటంతో గడువు ముగుస్తున్న కొద్దీ రైళ్ల రాకపోకలను చర్లపల్లి మీదుగా సాగించాలని నిర్ణయించింది.

50వేల మంది రాకపోకలు సాగించేలా దక్షిణ మధ్యరైల్వే ఏర్పాట్లు.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రోజూ సుమారు 50వేల గ్రుంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరకు రవాణా పార్సిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారు 40శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులోగా మొత్తం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం నిర్దేశించుకుంది. రోజూ 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న ఈ స్టేషన్లో రైళ్ల రాకపోకలు, నిర్మాణ పనులు చేపట్టడంలో సమతూకం పాటించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది.

**వచ్చి పోయే రైళ్లు ఇవి......** చెన్నై ఎక్స్‌ప్రెస్, గోరఖ్ పూర్ ఎక్స్‌ప్రెస్, కాగజ్‌నగర్, ఇంటర్ సిటి, కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, పుష్పుల్ (సికింద్రాబాద్, వరంగల్), శబరి ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం), శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, ఘట్కేసర్ ఎంఎంటీఎస్, రేపల్లే ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

## జెసి ప్రభాకర్‌రెడ్డిపై సైబరాబాద్ సిపికి మాధవీలత ఫిర్యాదు

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త**

బీజేపీ నేత, సినీనటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతోంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. జేసీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.జేసీ మాటలతో తాను, తన కుటుంబం ఎంతగానో ఇబ్బంది పడిందని ఈ సందర్భంగా మాధవీలత అన్నారు. క్షమాపణ చెప్పానంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఇలాంటి భాష మాట్లాడితే ఎలా అని నిలదీశారు.. అసలు వివాదమేంటి?.. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్క్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అయితే ఆ వేడుకలకు వెళ్లవద్దని.. అక్కడ మహిళలకు రక్షణ ఉండదని మాధవీలత ఒక వీడియో రిలీజ్ చేశారు. దీనిపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మాధవీలత ఒక సినిమా యాక్టర్ అని.. యాక్టర్స్ అంతా ప్రాస్టిట్యూట్స్‌నే అని పరుష పదజాలంతో విమర్శించారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. దీనిపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. దీంతో వెనక్కి తగ్గిన జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. తన వయసు 72 సంవత్సరాలు అని.. ఆవేశంలో అలా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరచాలనే ఉద్దేశంతో మాట్లాడలేదని వివరించారు. ఎవరి బతుకుదెరువు వారిదేనని అన్నారు. మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని తెలిపారు. మాధవీలతను క్షమాపణలు కోరారు.జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం ముగిసిపోతుందని అంతా అనుకున్నారు. కానీ మాధవీలత మాత్రం జేసీని క్షమించలేదు. ఆ విషయాన్ని ఎంతలా మరిచిపోదామన్న తన వల్ల కావడం లేదని అప్పట్లోనే ఒక వీడియోను కూడా రిలీజ్ చేశారు. చాలా ప్రయత్నం చేశా.. కానీ నేను మనిషినే.. నా ఆత్మ గౌరవం మీద జరిగిన దాడి.. నాకున్న బాధను వర్ణించే పదాలు లేవు. ప్రతిక్షణం వేదనతో నిండి ఉంది. కోపం, నిరాశ, ఆవేదన, దుఃఖం.. అన్నీ ఒకేసారి నన్ను కుదిపేస్తున్నాయి. అని మాధవీలత అన్నారు. ఎన్నోసార్లు ఎందరో తన ఆత్మవిశ్వాసాన్ని చిదిమివేయాలని ప్రయత్నం చేశారని.. పదే పదే ఇవే మాటలన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), ఫిలిం ఛాంబర్‌లో మాధవీలత ఫిర్యాదు చేశారు.

## గర్భిణీని హత్య చేసిన భర్త అరెస్టు


హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న కుషాయిగూడ ఏసిపి మహేష్‌గౌడ్, సీఐ అంజయ్య, ఎస్సై వెంకన్నలు...

**కుషాయిగూడ, జనవరి 21 ప్రభాతవార్త:** భార్యపై అనుమానంతో నిండు గర్భిణీ అని చూడకుండా అత్యంత కర్కశంగా భార్యను హత్య చేసిన సంఘటనను కుషాయిగూడ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. కుషాయిగూడ ఏసిపి మహేష్ గౌడ్, ఇన్స్పెక్టర్ అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ వెంకన్న లో తెలిపిన వివరాల ప్రకారం కాచిగూడ ప్రాంతానికి చెందిన అతిపాముల సచిన్ సత్యనారాయణ 21 కాప్రా ప్రాంతానికి చెందిన స్నేహ 21 లకు ఇన్స్టాగ్రామ్ లో పరిచయం ఏర్పడింది. కాగా ఇన్స్టాగ్రామ్ పరిచయం ప్రేమగా మారి 2022లో వీరిద్దరు వివాహం చేసుకున్నారు. సచిన్ సత్యనారాయణ మొదటగా ఫుడ్ బై డెలివరీ గా పని చేస్తూ ఉండేవాడు వీరి వివాహ బంధంలో ఓం బాబు జన్మించాడు. తర్వాత సచిన్ పనిచేయకుండా జుల్రై గా తిరుగుతూ ఆర్థిక ఇబ్బందుల్లో కోరుకుపోయాడు. ఈ క్రమంలో తన బిడ్డను పాత బస్తీకి చెందిన ఓ వ్యక్తికి అమ్మాలని పథకం వేసి లక్ష రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య స్నేహ కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో భర్త పై ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యధావిధిగా బిడ్డను తల్లికి అప్పగించారు. కాగా అనారోగ్యం కారణంగా బిడ్డ మృతి చెందాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు వెలువెత్తడంతో ఇరువురు దూరంగా ఉన్నారు. తదనంతరం డిసెంబర్ 11న మళ్లీ కలుసుకొని నివాసం ఉంటున్నారు. భార్య 7 నెలల గర్భిణీ ఉన్నట్లు తెలుసుకున్న సచిన్ సత్యనారాయణ నాతో దూరం ఉన్న సమయంలో నీకు గర్భం ఎలా వచ్చిందంటూ ఆమెను ప్రశ్నించి అనుమానించేసాగాడు. పథకం ప్రకారం జనవరి 15న రాత్రి భార్యకు మద్యం తాగించి 16న ఉదయం 5 గంటల సమయంలో భార్య గర్భముతో ఉన్న కడుపుపై కూర్చొని దిండును ముఖంపై పెట్టి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు భార్య కడుపుపై కూర్చొని అమానవీయంగా కర్కశంగా ప్రవర్తించిన ఆమె కడుపులో ఉన్న బిడ్డ కూడా బయటకు వచ్చి మృత్యువాత పడింది. ఈ హత్యను ఆత్మహత్యగా ప్రమాదంగా చిత్రీకరించే విధంగా యోచించి వంట గదిలో సిలిండర్ను తీసుకువచ్చి గ్యాస్ లీక్ అయ్యేలా పైపును బయటకు తీసి పారిపోయాడు సిలిండర్ గ్యాస్ అయిపోవడంతో అతడి పన్నాగం బెడిసి కొట్టింది. ఈనెల 18న గది నుంచి దుర్వాసన రావడంతో ఇరువు పొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు భర్త ప్రవర్తన గతంలో జరిగిన గొడవలు వ్యవహారం తీరును యోచించి కుషాయిగూడ పోలీసులు రంగంలోకి దిగి వారి దర్యాప్తు ముమ్మరం చేశారు. పరారీ లో ఉన్న దుండగుడు కాచిగూడ లో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు దుండగుడు సత్యనారాయణ ను అరెస్టు చేసి విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు సత్యనారాయణ ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఇలాంటి దుండగులకు కఠిన శిక్ష పడే విధంగా కేసు నమోదు చేశామని కుషాయిగూడ ఏసిపి మహేష్ గౌడ్, ఇన్స్పెక్టర్ అంజయ్య ,అడ్మిన్ ఎస్ఐ వెంకన్నలు తెలిపారు.


రాజ్‌భవన్‌లో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో బిపి ఆచార్య,ఐఎఎస్(రిటైర్డ్) రాసిన కార్టూన్ల పుస్తకాన్ని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విడుదల చేస్తున్న దృశ్యం

## ఆర్టీఏ కార్యాలయంలో నాగచైతన్య సందడి


ఖైరతాబాద్ ఆర్టీఓ కార్యాలయానికి వచ్చిన హీరో నాగచైతన్యతో జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ రమేష్

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త**

టాలీవుడ్ హీరో నాగచైతన్య మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం వద్ద సందడి చేశారు. ఆయన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ కోసం వచ్చారు. రవాణా శాఖ అధికారులు ఆయన వివరాలు తీసుకొని, ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ రమేష్‌తో కలిసి మాట్లాడారు. నాగచైతన్యను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

## తమపై దాడిచేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి : బాధితులు

**తార్నాక, జనవరి 21 ప్రభాతవార్త :** తమపై ధాడిచేసిన వారిపై ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితులు తమ ఆవేదనను వెలుబుచ్చారు. మల్కాజ్గిరి ఎంపీ ఇటల రాజేందర్ ఎంట్రీతో కొర్రెముల లోని ఏకశిలా నగర్ శ్రీహర్షకన్‌స్ట్రక్షన్స్ భూముల వివాదం వివాదాస్పదంగా మారిందన్నారు. ఏకశిలా నగర్ వెంచర్ బాదితులు మంగళవారం తార్నాక లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయభాస్కర్‌లు మాట్లాడుతూ ఎంపీ ఇటల రాజేందర్ తమ భూమిలోకి రావడం ఎంతో భాద కల్గించిందన్నారు. ఇటల రాజేందర్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని అలాంటి ఆయన తమ భూమి మీదకు వచ్చి మాట్లాడటం తమందరం కలత చెందామన్నారు. ఈ ఏకశిలా నగర్ భూములకు యజమానుల తామే అన్నారు. ఈ వెంచర్ కి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ మావద్ద ఉన్నాయని అన్నీ న్యాయస్థానాల్లో తీర్పు మాకు అనుకూలంగా వచ్చిందని వివరించారు. భూయజమానులమైన మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీహర్ష కన్ స్ట్రక్షన్స్ కు సంబంధించిన సర్వేనెంబర్ 739, 740, 741, 742 ఘట్కేసర్ మండలంలోని కొర్రెముల గ్రామంలో 47 ఎకరాల 25 గుంటల భూమిని 2007లోనే ప్రభుత్వం ద్వారా మ్యుటేషన్ పొందామన్నారు. ఇందుకు సంబంధించిన ఏడు ఎకరాల పట్టా పాస్ పుస్తకం ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. సర్వేనెంబర్ 743 నుండి 747 వరకు రద్దు చేయబడిన అక్రమ లేవట్లలోని ప్లాట్లను తక్కువ రేటు కొని ప్రజలను మోసగించి ఎక్కువ మొత్తంలో లాభాలను గడించిన వ్యక్తులు కుట్రలు పన్ని మా భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ స్థలంపై కన్నేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని మా ఆస్తిని, మమ్మల్ని కాపాడా లని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.ఎంపీ ఈటల వాస్తవాలు తెలుసుకో కుండా దా డులకు దిగడం తమ కుటుంబాలను తమను ఎంతో భాదకల్గిం చిందన్నా రు. ఎంపీ తన అనుచరులతో విచక్షణ రహితంగా మాపై దాడికి పాల్ప డ్డారని ఆరోపించారు.

## రైలును ఆపి పట్టాలపై ప్రయాణికుల ఆందోళన..

**శేరిలింగంపల్లి, జనవరి 21, ప్రభాతవార్త**

తమ ప్రాంతానికి బస్సు సర్వీస్ లేకపోతే ఏర్పాటు చేయాలంటూ రోడ్డెక్కి ఆందోళనలు చేయడం చూశాం. కానీ ట్రైన్ రోజు ఆలస్యంగా వస్తోందని ఆగ్రహానికి గురైన ప్రయాణికులు ఏకంగా రైలును ఆపి నడి పట్టాలపైనే ధర్నాకు దిగారు. ఈ విచిత్ర ఘటన తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తాపూర్ సికింద్రాబాద్ మధ్య చిత్తాపూర్ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీస్ ఉంది. అయితే చిత్తాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజు ఆలస్యంగా వస్తోంది. ఏకంగా రెండు, మూడు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో విసిగిపోయిన ప్రయాణికులు చేసేదేమి లేక చిత్తపూర్ ఎక్స్‌ప్రెస్ ఖచ్చితమైన వేళలు పాటించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చిత్తాపూర్ ట్రైన్ను నిలిపి పట్టాలపై ఆందోళన చేశారు. ప్రతిరోజు ఉదయం 7:30కి లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకోవలసిన ట్రైన్ మూడు, నాలుగు గంటలు ఆలస్యంగా నడుపుతుండడంతో ఉద్యోగాలకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సకాలంలో ఆఫీసులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి చిత్తాపూర్ ఎక్స్‌ప్రెస్ కరెక్ట్ టైమింగ్ పాటించేలా చర్యలు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన నిర్వహించిన ప్రయాణికులను లింగంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రైన్ సమయ పాలన పాటించాలని కోరుతూ ప్రయాణికులు రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ షెడ్డు కూల్చివేత..
(వార్తకు స్పందన)


షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 21, ప్రభాతవార్త**

హైదర్ నగర్ డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో సర్వే నంబర్ 90/2లో ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ షెడ్డు నిర్మాణాన్ని అధికారులు మంగళవారం సంక్రాంతి పండుగ వేళ హైదర్‌నగర్‌లో కబ్జాకు కుట్ర అనే శీర్షికన వచ్చిన వార్త కథనానికి స్పందించిన అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మనస్థాపంతో విద్యార్థిని ఆత్మహత్య

**తార్నాక, జనవరి 21 ప్రభాతవార్త :** ప్రేమించిన విషయం తల్లిదండ్రులకు తెలుస్తుందని తీవ్ర మనస్థాపానికి గురైన ఇంటర్ విద్యార్థినీ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్టే స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట, పెద్దకుదూరుకు చెందిన చంద్రం కుమార్తె దర్శనం భార్గవి(17) ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఆంధ్ర మహిళసభలో ఇంటర్మీడియట్ సేఈసీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఓ అబ్బాయిని ప్రేమిస్తున్నట్లు తెలిసింది. ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలుస్తుందని భార్గవి మనస్థాపం చెంది మంగళవారం జమై ఉస్మానియా రైల్వేస్టేషన్ లోని రైలు పట్టాలపై తుంగభద్ర రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. తల మొండెం విడిపోయి ఉన్న భార్గవి మృతదేహాన్ని చూసి తోటి విధ్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ తెలిపారు.

**ట్రాఫిక్ నియమాలను పాటించండి : టిటిఐ ఇన్స్‌పెక్టర్ రాంచందర్**

**బేగంపేట జనవరి 21,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భవిష్యత్‌ను కాపాడుకోవాలని బేగంపేట టీటీఐ ఇన్స్‌పెక్టర్ వి.రాంచందర్ అన్నారు.జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ పోలీసు కమీషనర్ సీ.వీ ఆనంద్ ,ట్రాఫిక్ అడిషినల్ సీపీ విశ్వ ప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం సికింద్రాబాద్ వెస్లీ జూనియర్ కళాశాల విద్యార్థులకు బేగంపేట టీటీఐ ఇన్స్‌పెక్టర్ వి.రాంచందర్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ యువత ముఖ్యంగా ఓవర్ స్పీడ్,ట్రిబుల్ రైడింగ్ చేస్తూ సిగ్నల్ జంపింగ్ చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు.ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.


జిహెచ్ఎంసి సుందరీకరణ పనుల్లో నారాయణగూడ ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్, వైఎంసిఏ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ ఆకట్టుకుంటున్న దృశ్యం

## డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### -కార్పొరేటర్ మొద్దు లచి రెడ్డి



**వనస్థలిపురం. జనవరి. 21.ప్రభాతవార్త.**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి మరియు సమస్య పరిష్కారం కోసం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి , జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ..డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ సాయిబాబా ఆలయం నుంచి శివాలయం వరకు రోడ్డు గుంతలు పడి భక్తులకు, కాలనీవాసులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని వెంటనే నూతన రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలన్నారు.సాహెబ్ నగర్ శ్రీ సీతారామాంజనేయ కళ్యాణ మండపాన్ని మరమ్మతులు చేయించి నూతన రంగులు వేయించాలని.సాహెబ్ నగర్ లోని మహిళా సంక్షేమ సంఘం భవనముకు ప్రహరి గోడ మరియు మరమ్మతులు చేయించాలని. గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ లో ఉన్న మట్టి రోడ్డులో సిసి రోడ్డు నిర్మాణం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ ఆశలత,ఎసిపి విజయశ్రీ, డిఈ దామోదర్ రావు, శానిటేషన్ డిఈ నీలిమ, హార్టికల్చర్ మేనేజర్ మేధ, జిహెచ్ఎంసి ఏఈ రాజ్ కుమార్,టిపిఎస్ అక్బరుద్దీన్, శానిటేషన్ ఎస్ఎస్ అజీముద్దీన్ మరియు వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి,ఎస్ఎఫ్ఎ చంద్రశేఖర్,గోవర్ధన్ రెడ్డి,పాల్గొన్నారు.

## అక్బర్ బాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా కిరణ్ యాదవ్


అక్బర్ బాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా నియమితులైన కిరణ్ యాదవ్ ను సన్మానిస్తున్న సీనియర్ న్యాయవాది రామారావు తదితరులు

**మలక్ పేట ,జనవరి 21, ప్రభాతవార్త:** అక్బర్ బాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా కిరణ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్బర్ బాగ్ డివిజన్ లో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులను కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తామని పేర్కొన్నారు .కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. అక్బర్ బాగ్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన కిరణ్ యాదవ్ ను సీనియర్ న్యాయవాది, బిజెపి నాయకులు రామారావు తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి

### -ఎమ్మెల్యే అహ్మద్ బలాల


మలక్ పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట ,జనవరి 21, ప్రభాతవార్త :** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్పేట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి నూతనంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలాం షాహిద్, మీనాజుద్దీన్, అధికారులు పీర్ సింగ్, మల్లికార్జున్, వెంకన్న, వర్క్ ఇన్ స్పెక్టర్లు హమ్మెద్, సత్యానారాయణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : అబ్రార్


ఫరత్ నగర్ లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు అబ్రార్ తదితరులు

**మలక్ పేట, జనవరి 21, ప్రభాతవార్త :** అజంపురా డివిజన్ లో వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్ లోని ఫరత్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణం పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తున్నామని పేర్కొన్నారు వివిధ శాఖల అధికారులతో కలిసి డివిజన్ లోని పలు ప్రాంతాలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్, వర్క్ ఇన్ స్పెక్టర్ హమ్మెద్ పాల్గొన్నారు.

## ప్రవచన సప్తహ మహోత్సవం

**వనస్థలిపురం. జనవరి. 21.ప్రభాతవార్త :**
వనస్థలిపురం శ్రీకృష్ణదేవరాయ నగర్ లో ఉన్న శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో వనస్థలిపురం భక్త సమాజంలో మరియు తిరుమల తిరుపతి దేవస్థానం మరియు హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సారధ్యంలో కార్యక్రమం ప్రవచన సప్తహ మహోత్సవం రెండవ రోజు కార్యక్రమం “భక్త ధృవుడు“ శ్రీ కుప్పా శ్రీనివాస శాస్త్రి ప్రవచనంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి దేవస్థానం తరపున కార్యదర్శి జానకి రామారావు , రఘురాం జాయింట్ సెక్రెటరీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం కార్యవర్గం తరపున వారు వచ్చిన భక్తుల సమక్షంలో ప్రవచనకర్తను సన్మానించి ఈ ప్రవచన కార్యక్రమం ఈరోజు మొదలైనది కామేశ్వరరావు శ్రీ కుప్పా కళ్యాణ్ శ్రీ అన్నమరాజు ప్రభాకర్ ,మహిళా భక్తులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి : చైర్‌పర్సన్ అనురాధ రాం రెడ్డి



**తుర్కయంజాల్ జనవరి 21 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ పథకాలను అన్ని వార్డులలోని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్పర్సన్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి తెలిపారు. మంగళ వారం మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ ఫంక్షన్ హాల్లో వార్డు సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ అన్ని వార్డులలోని ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, రేషన్ కార్డులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా జాబితాలో లేనివారు ఉంటే కొత్త దరఖాస్తులను అన్ని వార్డు సభలో సంబంధిత అధికారులకు సమర్పించాలని కోరారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పథకాలు సద్వినియోగం చేసుకోవడానికి చక్కని అవకాశమని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం పరుచుకోవడం ద్వారా సామాజికంగా ఆర్థిక ప్రగతిని సాధించవచ్చని ఈ సందర్భంగా ప్రసంగించారు. రేపు ఇంజాపూర్, కమ్మగూడ, తుర్కయంజాల్ మరియు ఉమర్ఖాన్ గూడ లో వార్డు సభలు ఉంటాయని ఈ అధికారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి,కార్యాలయ అధికారులు, కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్, సోలిపురం నరసింహారెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు మున్సిపాలిటీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్లు అందజేత

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి 37 కంప్యూటర్లు, ఎల్ఈడీ స్క్రీన్, వైట్ బోర్డు, కంప్యూటర్ చైర్స్, కబోర్డ్, సిట్టింగ్ చైర్లు, టేబుల్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మధురా ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారని, ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 26 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పేద విద్యార్థులకు తన వంతు చేయూత అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం ట్రస్ట్ సహకారం అందిస్తుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.విజయకుమార్, ఐడి కళాశాల ప్రిన్సిపల్ అలువేలుమంగమ్మ విశ్వనాద్‌కుమార్, బిఆర్ఎస్ పార్టీ నేతలు మేకల మధుసూధన్‌రెడ్డి, ముశ్యం శ్రీనివాస్, గోనె అర్జున్‌రెడ్డి, అన్య బాలకృష్ణ, పిల్లి నాగరాజు, జెట్ట కిషోర్,బి.నిరంజన్‌చారి, శ్రీనివాసాచారి, రంగ భాస్కర్ గౌడ్, కడిగె శేఖర్, పంగ మహేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌గౌడ్ ,పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మధురా ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

## రవితేజ బాడీని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** అమెరికాలో దుండగులు చేతిలో మరణించిన రవితేజ బాడీని వెంటనే తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం గ్రీన్‌హిల్స్ కాలనీలోని రవితేజ తల్లిదండ్రులను సబితాఇంద్రారెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాడీని తీసుకువచ్చేందుకు ప్రభుత్వము వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కేటీఆర్‌తో మాట్లాడి అతనికి అమెరికాలో ఉన్న పరిచయాలతో తొందరగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రవితేజ ప్రాణాలు తీసుకురాలేకపోయినా బాడిని త్వరగా తీసుకొచ్చేందుకు సహకారం అందిస్తామన్నారు. పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్‌ముదిరాజ్, పెంబర్తి శ్రీనివాస్, సాజిద్, నవీన్, రమేష్‌కురుమ తదితరులు ఉన్నారు.


తండ్రి చంద్రమౌళిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో వార్డు సభలు ప్రారంభం


దరఖాస్తులు స్వీకరిస్తున్న మీర్‌పేట్ కమీషనర్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ పోరెడ్డి పద్మ భాస్కర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలను అందించే ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వార్డు సభలు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మంగళవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 46 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో తొలి రోజు కమీషనర్ ఆర్. జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో 1, 2, 3, 8, 9, 10, 15, 16, 17, 22,23, 24, 29, 30, 31, 36, 37, 38, 43 డివిజన్లలో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ల అధ్యక్షతన జరిగిన ఈ వార్డు సభల్లో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు తదితర వాటి కోసం ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కాగా ఈ సభల్లోనే గతంలో దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాను అధికారులు ప్రకటించారు. అయితే కొత్తగా చేపట్టిన ఈ వార్డు సభల్లో గతంలో దరఖాస్తులు చేసుకోని అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ డి.చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

### -బడంగ్‌పేట్ మేయర్ పారిజాత


మామిడిపల్లిలో దరఖాస్తులు తీసుకుంటున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాత ,కమీషనర్ సరస్వతి, స్థానిక కార్పొరేటర్లు ఉన్నారు

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వార్డు సభలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కమీషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని 11, 12, 13, 14, 16, 17, 18 తదితర డివిజన్లలో వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిపల్లిలో జరిగిన వార్డు సభకు హాజరైన పారిజాత పలువురి నుండి దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కావాల్సిన అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు యాతం పవన్ యాదవ్, సుక్క బాలరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.


## జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రారంభమైన వార్డు సభలు


ప్రజా పాలన వార్డు సభల బందోబస్తును పరిశీలిస్తున్న రాచకొండ కమీషనర్ సుధీర్‌బాబు :చిత్రంలో మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం ప్రజాపాలన వార్డు సభలను నిర్వహించారు. స్థానిక కమీషనర్ వెంకట్‌రామ్ ఆధ్వర్యంలో జరిగిన వార్డు సభల్లో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ఇంఛార్జి స్రవంతితో పాటు పలువురు అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు. కాగా జల్‌పల్లి మున్సిపాలిటీలో జరిగిన ప్రజా పాలన వార్డు సభలను రాచకొండ కమీషనర్ సుధీర్‌బాబు పరిశీలించారు. మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి, పహాడీషరీఫ్ ఇన్స్‌పెక్టర్ గురువారెడ్డి తదితరులతో కలిసి ఆయన బందోబస్తును పర్యవేక్షించారు.

## 24నుంచి ట్రైబల్ యూత్ ఎక్ఛేంజ్ కార్యక్రమాలు

### జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా


పోస్టర్స్ ను ఆవిష్కరిస్తున్న జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా తదితరులు

**మలక్ పేట ,జనవరి 21, ప్రభాతవార్త:** నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సహకారంతో ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 16వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను రాజేందర్ నగర్ లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా పేర్కొన్నారు. మలక్ పేటలోని నెహ్రూ యువ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, గౌరవ అతిథిగా ఎంపీ. అనిల్ కుమార్ యాదవ్ లు హాజరవుతున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ ,ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల కు చెందిన సుమారు 200 మందికిపైగా ట్రైబల్ యూత్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్ మెంట్, ఎంటర్ ప్రేన్యుర్ డెవలప్ మెంట్ ,కెరియర్ గైడెన్స్ ,కౌన్సిలింగ్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ నుంచి నెల రోజులపాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించే ప్రారంభత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ తదితరులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి రాజేష్, ప్రోగ్రాం అసిస్టెంట్ యాదగిరి, సాయి కృష్ణ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన సభల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారెంటీల విషయమై ప్రశ్నించాలని బిఆర్ఎస్ అధిష్టానం పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బిఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని నేతలను పోలీసులు కొద్ది సేపు గృహ నిర్బంధం చేశారు. అదే విధంగా పలువురిని అరెస్టు చేశారు. అయితే బిఆర్ఎస్ నేతల గృహనిర్బంధాలు, అరెస్టులను మీర్‌పేట్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఖండించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నాం : మల్‌రెడ్డి రంగారెడ్డి


అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

**హయత్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కారమే ద్యేయంగా పనిచేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కల్వంచ(10, 11వార్డులు)లో సుమారు 50 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన సోమవారం రాత్రి చైర్‌పర్సన్ పండుగుల రాజు జయశ్రీతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కల్వంచ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ కాలనీలకు ధీటుగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సదుపాయాలను కల్పిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమ్యూనిటీ హాలు, గ్రంథాల యం, సీసీకెమెరాలను ప్రారంభించి క్యాలెండర్‌ను ఆవి ష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు సామ అనుష రోహిత్‌రెడ్డి, మల్‌రెడ్డి దీపికరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, చామ విజయశేఖర్‌రెడ్డి, సిద్ధంకి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు సదుపాయాలను కల్పించాలని వినతి


ఈటెలకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం... కాలనీలు విస్తరిస్తుండడంతో మౌళిక సదుపాయాల కొతర ఏర్పడుతోందని అవసరమైన మేర నిధులను కేటాయించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కారొ ్పరేటర్ మాట్లాడుతూ... శివారు కాలనీల్లో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, కాలనీలు విస్తరిస్తున్నాయని అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు వంటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రూ.49లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే


కల్యాణపురిలో ఒపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో రూ.49లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. బ్యాంక్ కాలనీలో రూ.389లక్షలతో కమ్యూనిటిహాల్ మొదటి అంతస్థుతోపాటు, నార్త్ కల్యాణపురిలో రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన ఒపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. చిలుకానగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, ఈరెల్లి రవీం దర్‌రెడ్డి, పిట్టల నరేష్, మాస శేఖర్, గడ్డం పాపిరెడ్డి, వి.బి.నరసింహ కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ : ఎండి.రఫీక్


రామంతాపూర్‌లో రేషన్‌కార్డుల జారీ సర్వే పరిశీలిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

**రామంతాపూర్, జనవరి 21 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో అర్హులందరికి రేషన్‌కార్డులు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రామంతాపూర్ వివేక్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్‌కార్డుల సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికి రేషన్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే వార్డు సమావేశాలలో కొత్త వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే కొత్త కార్డులు అందజేస్తామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు సుర్వి మురళీగౌడ్, సంధ్యారాణి, గాయత్రి, అరుణ్‌సాయి, యూత కాంగ్రెస్ కార్యదర్శి తోట శంకర్,యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నాని, మధు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**ఎల్.బి.నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం 2025 క్యాలెండర్ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అందరికి శుభం కలగాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, సత్యాచారి, రవిముదిరాజ్, మధుసాగర్ పాల్గొన్నారు.

## జాతీయ కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సురేష్‌నాయుడు

**ఎల్.బి.నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** జాతీయ కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా దిల్‌సుక్‌నగర్‌కు చెందిన తిరుమనాథం సురేష్ నాయుడు నియామకమయ్యారు. జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్‌నాయుడు మాట్లాడుతూ కాపు కులంలోని అన్ని వర్గాలను సమైక్యపరిచి సామాజికంగా రాజకీయంగా కాపు జాతి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశాన్ని కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ కమిటీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కాపు సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

## విద్యార్థులను వేధింపులకు గురి చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ప్రవీణ్‌రెడ్డి


ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రవీణ్‌రెడ్డి


**సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** ఫీజుల విషయంలో విధ్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న విద్యాసంస్థలపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఎల్‌బినగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ శేఖర్‌రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఫీజులు చెల్లించలేదని విధ్యార్థులను కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు తరగతి బయట నిలుచోబెడుతున్నారని, పరీక్షలకు హాజరు కానివ్వడం లేదని, దీనివల్ల విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఇలాంటి విద్యా సంస్థల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పల్సం శ్రీధర్‌గౌడ్, శ్రీనాథ్‌రావు, రోహిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్, మాదన్నపేటలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్న పోలీసులు

**సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** సైదాబాద్, మాదన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రజలకు భరోసా కల్పించడానికి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి స్థానిక పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఎసిపి వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన : సిఐ


ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి తదితరులు


**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :**
రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ట్రాఫిక్ పిఎస్ పరిధిలోని బండ్లగూడ బస్‌డిపో పరిధిలో ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై ప్రయాణిస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా వాహనదారులకు సీటు బెల్ట్ ధరించడం, హెల్మెట్ ధరించడం, నిబంధనలు పాటించడంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. క్యాబ్ డ్రైవర్లు సీటు బెల్ట్ ధరించాలని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగులు, పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి : పవన్


స్థానికులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ జనప్రియ అపార్ట్మెంట్ బాలాజీ నగర్ కాలనీలో రూ.9 లక్షల వ్యాయంతో నిర్మించనున్న నూతన భూగర్భ డ్రైనేజ్ పనులను మంగళవారం ఆయన ప్రారంభించి డ్రైనేజ్ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం విషయంలో సరైన లెవెల్స్ చూసుకోవాలని సూచించారు. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు ప్యాచ్ వర్క్ చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, సూర్య, ఖుర్షీద్, మోహన్, వాస్తవ్ పాల్గొన్నారు.

## ఎస్ఐగా పల్లా ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ


ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పల్లా ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాలనీ సంఘం నేతలు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎస్‌బి ఎస్ఐగా పనిచేసిన పల్లా ప్రభాకర్‌రెడ్డి నాచారం ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కురుమ సంఘం నేతలు గట్టయ్య యాదవ్, వీరస్వామిలు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ పల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాగా గత కొద్ది సంవత్సరాలుగా ఎస్‌బిలో ఎస్ఐగా పనిచేసిన ప్రభాకర్‌రెడ్డి స్థానికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.